సాక్షి పశ్చిమగోదావరి

బుధవారం । 1 । నవంబర్ । 2023



అట్లతద్ది వేడుకలు

అత్తిలి: మండలంలో అట్లతద్ది పండుగను మహిళలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కాలువ వద్ద, చెరువు వద్ద గౌరీదేవీకి పూజలు నిర్వహించి, వాయినాలు సమర్పించారు.



కిటకిటలాడిన మద్ది

జంగారెడ్డిగూడెం రూరల్: శ్రీమద్ది ఆంజనేయ స్వామి క్షేత్రాన్ని మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. 108 ప్రదక్షిణలు చేసి మొక్కలు తీర్చుకున్నారు.



వివాహిత దారుణ హత్య

పెనుగొండ శివారు అడ్డపుంత బోదే వద్ద వివాహిత హత్య కలకలం రేపింది. మృతదేహాన్ని పంటబోదేలో పడేసి హంతకులు పరారయ్యారు. 8లో

న్యూస్‌రీల్

పనులు వేగంగా పూర్తి చేయాలి



పనుల ప్రగతిపై సమీక్షిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ఏలూరు(మెట్రో): జెడ్పీ నిధులతో చేపట్టిన పనులను సత్వరమే పూర్తిచేయాలని జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. మంగళవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ద్వారా చేపట్టిన పనులపై సమీక్ష నిర్వహించారు. స్థానిక జెడ్పీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రగతిలో ఉన్న పనులను సత్వరమే పూర్తి చేయాలని, మొదలు పెట్టాల్సిన పనులను పరిశీలించి అవసరం అనుకున్నవి సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. అవసరం లేని పనులను గుర్తించి జాబితాలు తయారుచేసి పంపాలని అధికారులకు తెలిపామన్నారు.

ఉంగుటూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు: ఉంగుటూరు రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే వాసుబాబు మంగళవారం ప్రారంభించారు. సకాలంలో రైతులు ధాన్యాన్ని తరలించేందుకు ఉంగుటూరు మండలంలో 23 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు వాసుబాబు వెల్లడించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం గతంలో ఎప్పుడూ జరగలేదని వైఎస్ జగన్ ప్రభుత్వం ఆ పని చేస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో ఆర్బీకే చైర్మన్ తల్లాప్రగడ శివరామకృష్ణ, డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, వ్యవసాయశాఖ జేడీ రామకృష్ణ, తహసీల్దారు వెంకటరమణ, ఎంపీడీవో ప్రేమాన్విత తదితరులు పాల్గొన్నారు.

టెక్నికల్ పరీక్షల్లో 64 శాతం ఉత్తీర్ణత

సాక్షి, భీమవరం: జూలైలో నిర్వహించిన టెక్నికల్ సర్టిఫికెట్స్ కోర్సుల్లో 64 శాతం ఉత్తీర్ణత సాధించారని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది జూలైలో లోయర్‌గ్రేడ్, హైయర్‌గ్రేడ్, టైలరింగ్, డ్రాయింగ్, హ్యాండ్లూమ్, ఏవీ వింగ్ పరీక్షలకు 2,691 మంది హాజరుకాగా 1,733 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు సర్టిఫికెట్లను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పొందవచ్చని వెంకటరమణ తెలిపారు.

ఇసుక సర్వే డ్రాఫ్ట్ నివేదికపై అభ్యంతరాల స్వీకరణ

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ఇసుక, ఇతర ఖనిజాల లభ్యతపై నిర్వహించిన సర్వే డ్రాఫ్ట్ నివేదికపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్పేస్ అప్లికేషన్ సెంటర్ ద్వారా జిల్లాలో ఇసుక, ఇతర ఖనిజాల లభ్యతపై ఇటీవల సర్వే చేపట్టారు. జిల్లాకు సంబంధించిన డ్రాఫ్ట్ సర్వే నివేదికను ఎపిశాక్ జిల్లాకు అందజేసింది. జిల్లా డ్రాఫ్ట్ సర్వే నివేదికపై సాధారణ ప్రజల నుంచి సలహాలు స్వీకరించడానికి అక్టోబర్ 31 నుంచి 21 రోజుల పాటు వెబ్‌సైట్‌లు ఉంచారు. ప్రజలు డ్రాఫ్ట్ సర్వే నివేదికను పరిశీలించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే మెయిల్‌కు పంపాలని కలెక్టర్ ప్రశాంతి సూచించారు.

ఉంగుటూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఉంగుటూరు: ఉంగుటూరు రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే వాసుబాబు మంగళవారం ప్రారంభించారు. సకాలంలో రైతులు ధాన్యాన్ని తరలించేందుకు ఉంగుటూరు మండలంలో 23 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు వాసుబాబు వెల్లడించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం గతంలో ఎప్పుడూ జరగలేదని వైఎస్ జగన్ ప్రభుత్వం ఆ పని చేస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో ఆర్బీకే చైర్మన్ తల్లాప్రగడ శివరామకృష్ణ, డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, వ్యవసాయశాఖ జేడీ రామకృష్ణ, తహసీల్దారు వెంకటరమణ, ఎంపీడీవో ప్రేమాన్విత తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి 'పండగే'

- దసరా 11 రోజులకు రూ.33.62 లక్షల ఆదాయం
- జిల్లా వ్యాప్తంగా 222 ప్రత్యేక బస్సులు



భీమవరం(ప్రకాశం చౌక్): దసరా పండగ పశ్చిమ గోదావరి జిల్లా ఆర్టీసీకి మంచి ఆదాయం తీసుకొచ్చింది. పండగకు ఆర్టీసీ ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులను ప్రయాణికులు చక్కగా ఉపయోగించుకున్నారు. ఈ నెల 18 నుంచి 29 వరకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేయగా పండగ ముందు, తర్వాత హైదరాబాద్, విశాఖపట్నంకు ప్రత్యేక బస్సుల ద్వారా ప్రయాణికులు వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకున్నారు. ఈ దసరా పండగకు ప్రయాణికులు ఆర్టీసీల్లో ప్రయాణించడానికి ఆసక్తి చూపడంతో ప్రయాణికుల రద్దీ బట్టి బస్సులను ఏర్పాటు చేస్తూ మంచి ఆదాయం సాధించారు. సాధారణ చార్జీలకే ప్రత్యేక బస్సులను నడిపి ప్రయాణికులకు ఆర్టీసీ మరింత చేరువైంది. జిల్లాలో నాలుగు డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు ద్వారా ప్రయాణికులన సురక్షితంగా తీసుకొచ్చి జిల్లాలోని అన్ని బస్టాండ్‌ల నుంచి అన్ని వేళల బస్సులను అందుబాటులో ఉంచి వారి గమ్యస్థానాలకు చేర్చారు.

ప్రైవేట్ దోపిడీకి అడ్డుకట్ట : దసరా పండగకు ప్రైవేట్ ట్రావెల్స్ అడ్డంగా దోచు కుకోవడం సర్వసాధారణం. పండగకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి సాధారణ చార్జీలు, ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడి నుంచి తప్పించుకున్నారు.

ప్రత్యేక సర్వీసులు ఆదాయం 33.62 లక్షలు

జిల్లాలో నాలుగు డిపోల ద్వారా మొత్తం 222 ప్రత్యేక బస్సులను దసరా పండగకు హైదరాబాద్, విశాఖపట్టణం తదితర ప్రాంతాలకు నడపగా.. మొత్తం నాలుగు డిపోల ద్వారా రూ 33.62 లక్షలు ఆదాయం లభించింది. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి పండగకు జిల్లాకు వచ్చే వారికి నాలుగు డిపోల నుంచి పండగ ముందు తర్వాత 25 నుంచి ప్రత్యేక బస్సులు నడిపారు. దసరా పండగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా చేసిన సర్వీసుల్లో ఆర్టీసీకి ఆదాయం పెరిగింది. జిల్లాలోని నాలుగు డిపోల నుంచి విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి వెళ్లే ప్రయాణికుల ద్వారా, జిల్లాలోని పలు పుణ్యక్షేత్రాలకు, దూర ప్రాంతాలకు వెళ్లే వారి ద్వారా 11 రోజుల్లో రూ.55 లక్షల ఆదాయం వచ్చింది. సాధారణ రోజుల కంటే దసరా పండగ రోజుల్లో రోజుకు జిల్లా వ్యాప్తంగా రూ.5 లక్షల ఆదాయం అదనంగా వచ్చింది. దాంతో మొత్తం దసరా ఆదాయం రూ 88.62 లక్షలుగా ఉంది.

డిపోల వారీగా ఆదాయం

డిపో	ప్రత్యేక బస్సులు	ఆదాయం (రూ. లక్షల్లో)
భీమవరం	51	రూ 8.50
నర్సాపురం	66	రూ 7.81
తాడేపల్లిగూడెం	58	రూ 8.67
తణుకు	47	రూ 8.64

సాధారణ ధరలకే..



దసరా పండగకు ఆర్టీసీకి మంచి ఆదాయం లభించడం సంతోషం. పండగకు ప్రయాణికులు ఆర్టీసీ బస్సులను చక్కగా ఉపయోగించుకున్నారు. పండగకు ముందు తర్వాత కూడా హైదరాబాద్, విశాఖపట్టణానికి ప్రత్యేక బస్సులు నడిపాం. సాధారణ ధరలకే సర్వీసు చేశాం.

ఎం.వీరయ్య చౌదరి,
ప్రజా రవాణ అధికారి భీమవరం

సర్దార్ పటేల్‌కు నివాళులు



భీమవరంలో రన్‌ఫర్ యూనిటీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: స్వాతంత్ర్యానంతరం దేశంలోని సంస్థానాల్ని విలీనం చేసి ఏక్ భారత్‌గా ఏర్పడానికి సర్దార్ వల్లభాయ్‌పటేల్ ముఖ్యపాత్ర పోషించారని ఎస్పీ యు.రవిప్రకాష్ అన్నారు. మంగళవారం వల్లభాయ్‌పటేల్ 148వ జయంతిని పురస్కరించుకుని రాష్ట్రీయ ఏక్తా దివస్, రన్ ఫర్ యూనిటీలో భాగంగా భీమవరంలో నిర్వహించిన యూనిట్ రన్ ఉద్దేశించి ఆయన మాట్లాడారు. భీమవరం–తాడేపల్లిగూడెం రోడ్డులోని బీవీ రాజు విగ్రహం వద్ద నుంచి విష్ణు కళాశాల వరకు యూనిట్ రన్ నిర్వహించారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి సందర్భంగా పటేల్ చిత్రపటానికి అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో డీఎస్పీ బండారు శ్రీనాథ్, వన్‌టౌన్, టుటౌన్ సీఐలు అడబాల శ్రీను, జి శ్రీనివాస్, ట్రాఫిక్ సిఐ దాసు తదితరులు పాల్గొన్నారు.

యువతపైనే దేశ భవిష్యత్తు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: దేశ భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందని పోలీసు అమరవీరుల త్యాగాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఎస్పీ యు.రవిప్రకాష్ అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా వివిధ కళాశాలల విద్యార్థులకు పోలీసు శాఖ, శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు మంగళవారం భీమవరం డీఎన్నార్ కళాశాలలో బహుమతులు అందచేసిన సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోలీసులు అవసరమైతే యుద్ధంలో సైతం సైనికులుగా పోరాడతారని 1959 చైనా యుద్ధంలో పోరాడి నిరూపించారన్నారు. అదే స్ఫూర్తితో దేశ వ్యాప్తంగా ఆనాటి నుంచి పోలీసు అమర వీరులకు నివాళులర్పిస్తూ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కళాశాల అధ్యక్షుడు గోకరాజు వెంకటనర్సింహరాజు మట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారని వారికి సమాజం ఎంతగానో రుణపడి ఉంటుందన్నారు. భీమవరం డీఎస్పీ బండారు శ్రీనాథ్ మట్లాడుతూ పోలీసు అమర వీరుల త్యాగాలను వివరించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్స్ అందచేశారు. కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు, టూటౌన్ సీఐ జి.శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ బీఎస్ శాంతకుమారి, ఎస్‌సీపీ ఆఫీసర్ ఎ.వీరయ్య, చెరుకువాడ రంగసాయి పాల్గొన్నారు.

ఆరుగురు నిట్ విద్యార్థులకు తీవ్ర గాయాలు

- ఇద్దరి పరిస్థితి విషమం
- బాధితులకు డిప్యూటీ సీఎం పరామర్శ



గాయపడిన విద్యార్థులను పరామర్శిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



ప్రమాదంలో గాయపడిన విష్ణువర్ధన్, ఈశ్వర్, జగతా శ్రీనివాసు



డ్రైవర్ ఆదిత్య మృతదేహం



గాయపడిన గాజులపాటి హర్షవర్ధన్, సాత్విక్

తాడేపల్లిగూడెం, రూరల్, అర్బన్ : ఏపీ నిట్ విద్యార్థులు ప్రయాణిస్తున్న కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విద్యార్థుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందగా.. ఆరుగురు విద్యార్థులు గాయపడ్డారు. మంగళవారం రాత్రి 7.30 గంటల సమయంలో పెదతాడేపల్లి కమ్మ కల్యాణమండపం సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. కారు డ్రైవర్ బలమైన గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్‌కు రెండు సంవత్సరాల క్రితమే వివాహమైనట్టుగా తెలుస్తుంది. ఈశ్వర్ అనే విద్యార్థి పరిస్థితి విషమంగా ఉండటంతో రాజమండ్రిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో ఉన్న నవీన్‌కు తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందించారు. మిగతా నలుగురికి తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందించారు. అనంతరం వారికి పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. డ్రైవర్‌తో కలిపి ఐదుగురు మాత్రమే ప్రయాణించే కారులో ఏడుగురు ఎక్కారని పోలీసులు చెబుతున్నారు. విద్యార్థులు రెస్టారెంట్‌కు భోజనానికి వెళుతుండగా ఈ ఘటన జరిగిందని చెబుతుండగా, పుట్టినరోజు వేడుకకు వెళుతున్న సందర్భంగా ఈ ప్రమాదం జరిగిందని మరికొందరు చెబుతున్నారు. ఘటనా స్థలానికి తాడేపల్లిగూడెం రూరల్ పోలీసులతో పాటు నిట్‌కు చెందిన వైద్యుడు, చీఫ్ వార్డెన్ వెళ్లి సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

బాధితులను పరామర్శించిన డిప్యూటీ సీఎం

రోడ్డు ప్రమాదంలో గాయపడిన డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ పరామర్శించారు. జిల్లా ఎస్పీ రవిప్రకాష్‌తో కలిసి విద్యార్థులను పరామర్శించారు. అవసరమైతే ప్రభుత్వం నుంచి వైద్య సాయం అందిస్తామన్నారు. సంఘటన దురదృష్టకరం అన్నారు. విద్యార్థులకు అవసరమైన సాయం అందిస్తామన్నారు.

పెండింగ్ బిల్లులపై చర్యలు చేపట్టాలి

ఏలూరు(మెట్రో): పోలవరం ప్రాజెక్ట్ సహాయ పునరావాసం(ఆర్అండ్ఆర్) కింద నిర్వాసితుల పెండింగ్ బిల్లుల చెల్లింపుకు చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో, జంగారెడ్డిగూడెం ఆర్డీఓలను కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం పోలవరం ఆర్అండ్ఆర్‌కు సంబంధించి వివిధ అంశాలపై పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ ఆదిత్య, ఇతర సంబంధిత అధికారులతో కలెక్టర్ చర్చించి తక్షణ పరిష్కారానికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్అండ్ఆర్‌కు సంబంధించి ఐటీడీఏ పీవో, జంగారెడ్డిగూడెం ఆర్డీఓల వద్ద నున్న బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని అదే విధంగా ఆప్షన్–2, 3 కింద ఉన్న బిల్లులను కూడా త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పోలవరం ప్రాజెక్ట్ కింద 41.5 కాంటూరుకు సంబంధించి 25 గ్రామాలకు చెందిన స్ట్రక్చర్ల నిర్మాణాల పరిహారానికి సంబంధించిన రూ.13 కోట్ల బిల్లుల చెల్లింపుపై చర్యలు తీసుకోవాలన్నారు. 45.16 కాంటూరుకు సంబంధించి 16 గ్రామాలకు గాను మిగిలిన 5 గ్రామాల్లో ఎన్యుమరేషన్ వచ్చేవారంలోపు పూర్తిచేయాలని ఆర్అండ్‌బీ ఎస్ఈని ఆదేశించారు. ఇటీవల నిర్వహించిన గ్రామసభల్లో భూమి, ఆర్అండ్ఆర్‌కు సంబంధించి అందిన సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవోను కలెక్టర్ ఆదేశించారు. పరిహారం చెల్లింపులో భాగంగా 948 మంది నిర్వాసితులకు చెందిన పాన్‌కార్డుల కోసం సంబంధిత ఎంపీడీఓ, తహశీల్దార్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. వీసీలో ఐటీడీఏ పీవో సూర్యతేజ హాజరు కాగా పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ ఆదిత్య, డీఆర్ఓ ఎం.వెంకటేశ్వర్లు, ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్ సరళావందన, ఆర్డీఓ అద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

నవోదయలో 9, 11 తరగతులకు ఆహ్వానం

పెదవేగి: నవోదయలో 9, 11 తరగతుల ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ వై.చంద్రశేఖర్ చెప్పారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ 2023–24 సంవత్సరానికి జవహర్ నవోదయ విద్యాలయాల్లో లేటరల్ ఎంట్రీ సెలక్షన్ టెస్ట్ ద్వారా తొమ్మిది, పదకొండు తరగతిలో ప్రవేశం కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించే తేదీని ఈనెల 7 వరకు పొడిగించామన్నారు.

పారదర్శకంగా ఎగుమతులు

ఉంగుటూరు: జిల్లాలో 5.5 లక్షలు మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తులు లక్ష్యంగా ఏర్పాట్లు చేశామని సివిల్ సప్లయిస్ డీఎంకే మంజుభార్గవి తెలిపారు. ఉంగుటూరు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి వచ్చిన ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో 261 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేశామని తెలిపారు. 961 మందిని నియమించామని, 270 మంది శిక్షణ పొందిన వారిని నియమించామని తెలిపారు.

బస్సు యాత్ర సూపర్ సక్సెస్

దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి



దెందులూరు: దెందులూరు నియోజకవర్గంలో సోమవరప్పాడు– గోపన్నపాలెం వరకు జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్ర సూపర్ సక్సెస్ అయిందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బస్సు యాత్ర విజయవంతం చేయడం ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అభిమానం, ఎమ్మెల్యేగా తనను ఆశీర్వదించడం ఎన్నటికీ మరువలేనన్నారు. దెందులూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ కొఠారు అడ్డగా నియోజకవర్గ ప్రజలు నిరూపించారని, వచ్చే ఎన్నికల్లో దెందులూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడటం తథ్యమన్నారు. పార్టీలోని అన్ని విభాగాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సమష్టి కృషితో వారం రోజులుగా శ్రమించి ఎన్నడూ లేని విధంగా బస్సు యాత్రను విజయవంతం చేశారన్నారు. దెందులూరు నియోజకవర్గంలో బస్సు యాత్ర చిరస్థాయిగా నిలిచిపోయేలా విజయవంతమైందన్నారు. ప్రజాప్రతినిధులు, స్నేహితులు, నాయకులు ఫోన్లు, మెసేజ్‌లు చేసి అభినందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలకు అనుగుణంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద దళిత, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం పెద్ద పీట వేశారన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ద్వారా నాలుగున్నరేళ్లల్లో ప్రజలకు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరిస్తున్నారన్నారు. ప్రజలకు ఉన్న సమస్యలు తెలుసుకుని వాటిని కూడా పూర్తి చేయాలని ప్రతి ఎమ్మెల్యేను ప్రజల వద్దకే పంపుతున్న ప్రజానేతగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు.

తణుకు చోరీ ఛేదించిన పోలీసులు

- రూ.5.30 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం
- మహారాష్ట్రలో దొంగలను అరెస్టు చేసిన పోలీసులు
- 40 రోజులు మహారాష్ట్రలోనే మకాం



చోరీని ఛేదించిన పోలీసు అధికారులు, కానిస్టేబుళ్లకు ప్రశంసాపత్రాలు అందించిన ఎస్పీ రవిప్రకాష్

తణుకు అర్బన్: తణుకులో సెప్టెంబరు 12న జరిగిన భారీ చోరీని తాడేపల్లిగూడెం డివిజన్ పోలీసులు ఛేదించారు. తణుకు పద్మశ్రీ ఫంక్షన్ హాలులో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో చోరీకి సంబంధించిన వివరాలను ఎస్పీ రవిప్రకాశ్ వెల్లడించారు. 40 సంవత్సరాల క్రితం మహారాష్ట్ర నుంచి తణుకులో స్థిరపడ్డ రేణుకా జ్యూయలరీస్ యజమాని నాందేవ్ దేవ్కర్ ఇంట్లో సెప్టెంబరు 12 రాత్రి మహారాష్ట్ర నుంచి వచ్చిన అంతర్రాష్ట్ర దొంగలు పెద్ద ఎత్తున ఆభరణాలు చోరీ చేశారు. బాధితుడి ఇంట్లోకి ప్రవేశించి దేవ్కర్‌తోపాటు భార్య, పిల్లలపై దాడిచేసి తాళ్లతో కట్టి లాకర్‌లో ఉన్న బంగారు ఆభరణాలు తీసుకుని పరారయ్యారు. ఈ చోరీలో దేవ్కర్ వద్ద పనిచేస్తూ పై అంతస్తు గదిలో ఉంటున్న మహారాష్ట్ర విటా పట్టణం కుర్లికి చెందిన సూరజ్ కుంబార్ కూడా ఉండడంతో పోలీసులు ఆ దిశగా దర్యాప్తు ప్రారంభించారు. తణుకు డివిజన్ పరిధి పోలీసు యంత్రాంగం మూడు బృందాలుగా విడిపోయి మహారాష్ట్రలోని సాంగ్లి జిల్లాలో దర్యాప్తు చేపట్టారు. భాష తెలియని రాష్ట్రంలో 40 రోజుల పాటు శ్రమించిన పోలీసు యంత్రాంగం ఏకంగా రూ. 5.30 కోట్ల విలువైన 8 కేజీల 816 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో పోలీసు యంత్రాంగం చూపిన చొరవ, పోరాటపటిమ ఎంతో సాహసమని ఎస్పీ ప్రశంసించారు. ఈ ఘటనలో ప్రధాన సూత్రధారి మహారాష్ట్రకు చెందిన నితిన్ పాండురంగ జాదవ్ అలియాస్ బాక్సర్, అలియాస్ దాదాగా పిలిచే వ్యక్తిపై ఇప్పటివరకు దేశవ్యాప్తంగా రెండు బందిపోటు నేరాలు, రెండు హత్యా యత్నం కేసులతోపాటు మొత్తం 11 నేరాలు ఉన్నట్లు చెప్పారు. ప్రధాన సూత్రధారి నితిన్ జాదవ్‌ను అతని అనుచరుడు ఓంకార్ జాదవ్‌తోపాటు అమిత్ సందీప్ పాటిల్, సూరజ్ కుంభార్, కైలాష్ శిల్కే, ఎస్‌కే సాధిక్‌లను విడివిడిగా అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు.

స్థానిక పోలీసుల సహకారంతో..

దేవ్కర్ ఇచ్చిన సమాచారంతోపాటు దర్యాప్తులో భాగంగా దుండగుల కదలికలు మహారాష్ట్రలో ఉన్నట్లుగా నిర్ధారించుకున్న పోలీసు అధికారులు 40 రోజులపాటు అక్కడే ఉండి అక్కడి పోలీసుల సాయంతో మూడు బృందాలుగా విడిపోయి దర్యాప్తు ప్రారంభించారు. ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. బందిపోటు దొంగగా మారిన నితిన్ జాదవ్ మహారాష్ట్రలోనే ఉంటూ దేశవ్యాప్తంగా బంగారం కరిగించే యువకులను మంచి చేసుకుని వారి ద్వారా ఈ నేరాలకు పాల్పడుతున్నట్లుగా పోలీసులు చెబుతున్నారు.

పోలీసు అధికారులు, కానిస్టేబుళ్లకు ప్రశంసలు

చోరీ ఘటనను ఛేధించడంలో తాడేపల్లిగూడెం డివిజన్ పరిధిలోని డీఎస్పీ సి.శరత్ రాజ్‌కుమార్, తణుకు రూరల్ సీఐ సీహెచ్ ఆంజనేయులు, తణుకు పట్టణ సీఐ ఎం.నాగరాజు, ఎస్సైలు సీహెచ్ వెంకటేశ్వరరావు, డి.ఆదినారాయణ, కె.చంద్రశేఖర్, కె.సుధాకర్‌రెడ్డి, ఏఎస్సై ఎస్.శ్రీధర్, కానిస్టేబుళ్లకు ప్రశంసాపత్రాలు, రివార్డుగా నగదు పారితోషికాన్ని ఎస్పీ రవిప్రకాష్ అందచేశారు. మహారాష్ట్రలో ఎంతో సహకారం అందించిన ఇద్దరు కానిస్టేబుళ్లను ఘనంగా సత్కరించి ప్రశంసాపత్రం, నగదు పారితోషికం అందచేశారు.

చింతమనేని ఓవరాక్షన్

పోలీస్‌స్టేషన్‌లో స్వీట్లు పంచుతూ హడావుడి



చింతమనేనిని బయటకు పంపుతున్న సీఐ

ఏలూరు టౌన్: టీడీపీ మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మరోసారి తన పైత్యాన్ని ప్రదర్శించారు. చంద్రబాబుకు వైద్య చికిత్స నిమిత్తం న్యాయస్థానం మధ్యంతర బెయిల్ మంజూరు చేయగా దాన్ని చింతమనేని హడావిడి చేసే ప్రయత్నం చేశారు. ఏలూరు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన చింతమనేని సిబ్బందికి స్వీట్లు పంచారు. ఈ లోగా సమాచారం అందుకున్న ఏలూరు టూటౌన్ సీఐ చంద్రశేఖర్ స్టేషన్‌లో హడావిడి చేస్తున్న చింతమనేనిని బయటకు గెంటుకుంటూ వచ్చి గేటు బయటకు పంపివేశారు. పోలీస్‌స్టేషన్‌కు కూడా వెళ్లి చింతమనేని సిబ్బందికి స్వీట్లు పంచడం సరైన విధానం కాదంటూ పలువురు పోలీస్ అధికారులు అన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బందిని కావాలని ఇరుకునపెట్టేలా ఇలాంటి చీప్ ట్రిక్స్ చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ప్రీ ఆడిట్‌తో త్వరితగతిన బిల్లుల మంజూరు

సాక్షి, భీమవరం: మున్సిపాల్టీలు, దేవదాయశాఖలో ప్రీ ఆడిట్ కారణంగా బిల్లులు సక్రమంగా ఆన్‌లైన్ చేస్తే పనులకు సంబంధించిన బిల్లులకు ఆడిట్ అధికారులు వెంటనే ఆమోదించే అవకాశం ఉంటుందని ఆడిట్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ బి.చిన్నపరెడ్డి చెప్పారు. మంగళవారం భీమవరం వచ్చిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాల్టీల్లో ప్రస్తుతం ప్రీ ఆడిట్ జరుగుతున్నందున ఆడిట్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆన్‌లైన్‌లో పనులకు సంబంధించి ఏ విధంగా రికార్డులు తయారు చేయాలి? అనే విషయాలపై ఇంజినీరింగ్ అధికారులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. పనులకు సంబంధించి రికార్డులను సకాలంలో తయారుచేయకపోవడం వల్ల ఇబ్బందులు వస్తున్నట్లు అధికారులు తెలపడంతో వారికి పూర్తిస్థాయిలో వివరిస్తున్నట్లు చెప్పారు. గతంలో ప్రతి ఏటా ఒకసారి మాత్రమే ఆడిట్ చేయడం వల్ల అనేక ఇబ్బందులుండేవని పనులకు సంబంధించిన రికార్డులు సరిగ్గా లేకపోవడంతో అభ్యంతరాలు నమోదు చేయాల్సి వచ్చేదని చిన్నపరెడ్డి వివరించారు. ప్రీ ఆడిట్ విధానం గ్రామ పంచాయతీలు, యూనివర్శిటీల్లో కూడా ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.



చిన్నపరెడ్డి

వివాహిత దారుణ హత్య

పెనుగొండ: పెనుగొండ శివారు అడ్డపుంత బోదే వద్ద వివాహిత హత్యకు గురైంది. హత్యచేసి పంట బోదేలో పాడేసి హంతకులు పరారయ్యారు. వివరాల్లోకి వెళితే మంగళవారం ఉదయం అడ్డపుంతలో గుత్తుల చిన సత్యనారాయణ కౌలు చేస్తున్న పంట బోదేలో ఓ మహిళ మృతదేహం ఉందని గమనించిన రైతులు పోలీసులకు సమాచారం అందించారు. 25 ఏళ్ల వయస్సు ఉంటుందని భావించిన మహిళ శవం బోర్లా పడి పంట బోదేలో తేలుతూ ఉండడంతో సంచలనంగా మారింది. మహిళ వీపుపైనా, ఎడమ భుజం పైనా, చాతి పైన పదునైన ఆయుధంతో పొడిచిన గాయాలు ఉన్నాయి. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ కె.రవిమనోహరచారి, సీఐ జీవీవీ నాగేశ్వరరావు, ఎస్సై ఎస్ఎన్‌వీవీ రమేష్ పరిశీలించి, వీఆర్వో ప్రసాద్ ఫిర్యాదు మేరకు గుర్తుతెలియని మహిళ మృతదేహంగా కేసు నమోదు చేశారు. ఎస్పీ యు.రవిప్రకాష్ హుటాహుటిన పెనుగొండ చేరుకుని సంఘటన ప్రాంతాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. అయితే సాయంత్రానికి మృతురాలు చివటం నందినిగా గుర్తించారు. పోలీసుల అదుపులో ఆమె భర్త చివటం రాంప్రసాద్ ఉన్నట్లుగా విశ్వసనీయ సమాచారం. దొంగరావిపాలెంకు చెందిన పితాని నందినిను చివటం రాంప్రసాద్ 2019లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి 18 నెలలు కుమారుడు సైతం ఉన్నాడు. చివటం రాంప్రసాద్ హత్య చేసి ఉండవచ్చని భావిస్తున్నారు. పోలీసులు కేసు విచారణ జరుపుతున్నామని, త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.



నందిని మృతదేహం

యువకుడి ఆత్మహత్య

ఆగిరిపల్లి: కడుపు నొప్పి తట్టుకోలేక యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆగిరిపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నంద్యాల రంగమ్మకు కొడుకు, కూతురు ఉన్నారు. నంద్యాల భవానీ శంకర్ (18)కు కొన్ని రోజులుగా కడుపులో నొప్పితో బాధపడుతున్నాడు. సోమవారం తల్లి వంట పని మీద తోటపల్లికి వెళ్లగా మధ్యాహ్న సమయంలో భవానీశంకర్ కు విపరీతమైన కడుపులో నొప్పి రావడంతో నొప్పి తట్టుకోలేక ఉరి వేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గుర్తించి చికిత్స కోసం నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రి కి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ మేరకు ఏఎస్సై తావిరియా నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అరెస్ట్

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): జీలుగుమిల్లి మండలం దిబ్బగూడెంలో మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అక్రమంగా మద్యం తరలిస్తున్న ఒక మహిళను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వి. చంద్రశేఖర్ తెలిపారు. సుమతి అనే మహిళ వద్ద నుంచి 170 తెలంగాణ మద్యం (క్వార్టర్ బాటిల్స్) స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

ఆర్టీసీ బస్సుల్లో నగదురహిత టికెట్స్ కొనుగోళ్లు

- కండక్టర్స్ వద్ద ఉన్న టిమ్ మిషన్‌లలో పొందుపరిచిన క్యూఆర్ కోడ్
- తగ్గిన చిల్లర సమస్య
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు


ఆర్టీసీ బస్సులో టిమ్ మిషన్ ద్వారా టికెట్ కొడుతున్న మహిళా కండక్టర్


టికెట్ కోసం టిమ్ మిషన్‌లోని క్యూఆర్ కోడ్ ద్వారా ఫోన్‌పే చేస్తున్న ప్రయాణికుడు

తణుకు అర్బన్: ఆర్టీసీ బస్సుల్లో టికెట్ కొనుగోళ్లకు సంబంధించి నగదు రహిత సేవలు అందుబాటులోకి రావడంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 6నెలల క్రితమే బస్సు కండక్టర్లకు అందుబాటులోకి తీసుకువచ్చిన టిమ్ మిషన్‌ల్లో పొందుపరచిబడి ఉన్న సాంకేతికత ద్వారా అప్పట్లోనే ఆన్‌లైన్ పేమెంట్‌లకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌లు పొందుపరిచారు. ఇప్పుడు అదే క్యూఆర్ కోడ్ ద్వారా ప్రయాణికుడు స్మార్ట్‌ఫోన్‌లోని ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం వంటి ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా క్యూఆర్ కోడ్‌కు లింక్ చేసివచ్చే టికెట్ ధరలను స్కాన్‌చేసి చెల్లింపులు చేస్తున్నారు.

చిల్లర సమస్యలకు చెక్..

గతంలో ఆర్టీసీ బస్సుల ప్రయాణాలకు సంబంధించి టికెట్‌లకు చిల్లర సమస్య తీవ్రంగా వేధించేది. ప్రయాణికులు చిల్లర ఇవ్వని పరిస్థితుల్లో బస్సు దిగే క్రమంలో ఒకరిద్దరు ప్రయాణికులకు ముడిపెట్టి నోట్లు ఇవ్వాల్సిన దుస్థితి కండక్టర్లకు ఉండేది. కానీ ఇప్పుడు ఆర్టీసీలో కూడా సాంకేతికను జతచేసి ఆన్‌లైన్ పేమెంట్‌లద్వారా టికెట్ కొనుగోళ్లు జరుగుతుండడంతో ఇటు ప్రయాణికుడికి, అటు కండక్టర్‌కి కూడా ఇబ్బందులు తప్పాయి. ప్రయాణికులు తమ జేబులో డబ్బులు లేకుండానే నగదురహిత చెల్లింపులుచేస్తూ దర్జాగా ప్రయాణాలు చేసేస్తున్నారు.

నిత్యం 23వేల మంది ప్రయాణికులు..

తణుకు ఆర్టీసీ డిపోకు సంబంధించి పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సూపర్ లగ్జరీ, అల్ట్రాడీలక్స్, ఇంద్ర, వెన్నెల ఏసీ స్లీపర్, బైపాస్ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో 23వేల మంది ప్రయాణికులు ప్రయాణాలు చేస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

ఆర్టీసీ బస్సుల్లో నగదురహిత సేవలు


ప్రయాణికుల సౌకర్యార్థం తణుకు ఆర్టీసీ డిపోలోని బస్సులన్నింటిలోను కండక్టర్‌ల వద్ద ఉన్న టిమ్ మిషన్‌ల్లో పొందుపరచి ఉన్న క్యూఆర్ కోడ్ ద్వారా ప్రయాణికులు టికెట్‌లు తమ స్మార్ట్‌ఫోన్‌లలోని ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా కొనుగోలు చేసుకునే వెసులుబాటు ఉంది. నగదురహితంగా అందిస్తున్న ఈ సేవలు ప్రారంభించిన రోజు నుంచి ప్రయాణికులు సద్వినియోగం చేసుకుంటున్నారు.

– సప్పా గిరిధర్‌కుమార్, తణుకు ఆర్టీసీ డిపో మేనేజరు

చిల్లర సమస్య పోయింది...


ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులు వివిధరకాల యాప్‌ల ద్వారా స్కాన్ చేసి టిక్కెట్లను కొనుగోలు చేస్తున్నారు. దీంతో గతంలో టికెట్ల కొనుగోళ్లలో చిల్లర సమస్య కండక్టర్స్‌కు ప్రధాన సమస్యగా ఉండేది. కండక్టర్స్‌కు ప్రయాణికుల మధ్య ఇబ్బందులు సృష్టించే పరిస్థితి ఉండేది. ఇప్పుడు నగదరహిత సేవలు అందుబాటులోకి వచ్చిన రోజు నుంచి టిక్కెట్ ధర చెల్లింపులు సులువుగా మారాయి.

– సీహెచ్ రాఘవులు, తణుకు ఆర్టీసీ బస్సు కండక్టర్ –

యాప్‌ల ద్వారా చెల్లిస్తున్నాం..


ఆర్టీసీ బస్సుల్లో టికెట్‌ల కొనుగోళ్లకు సంబంధించి ప్రవేశపెట్టిన నగదురహిత సేవలు సద్వినియోగపడుతున్నాయి. ప్రయాణికుల వద్ద సరిపడా చిల్లర లేని సమయంలో స్మార్ట్‌ఫోన్‌లోని యాప్‌ల ద్వారా టికెట్ ధరలు చెల్లింపులు చేస్తున్నాం.

– రేలంగి రాంబాబు, తణుకు

కోరిన కోర్కెలు తీర్చే తల్లి పుంతలో ముసలమ్మ


అన్నసమారాధనలో అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని సవిత్రుపేటలో వేంచేసియున్న పుంతలో ముసలమ్మ అమ్మవారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం భారీ అన్నసమారాధన జరిగింది. 12 వేల మంది అన్నప్రసాదాలు స్వీకరించారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అప్పడ వైస్ చైర్మన్ వడ్డి రఘురాం నాయుడు, కాపు నాయకులు మారిశెట్టి అజయ్‌బాబు, మాకా శ్రీనివాసరావులు మాట్లాడుతూ అమ్మవారు కోరిన కోర్కెలు తీర్చే తల్లి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆకుల ధనశేఖర్, అంజిబాబు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆళ్వార్ దాస్ జయంతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాకర్స్ ఉద్యమ స్ఫూర్తి, వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకర ఆళ్వార్ దాస్ 94 వ జయంతిని మంగళవారం వాకర్స్ అసోసియేషన్ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కేవీ చలం, కార్యదర్శి పి.కుమారస్వామి, కోశాధికారి పీవీ పరమాత్మ, ప్రవా శ్రీనివాస్, వాకర్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దోమలతోనే వ్యాధుల వ్యాప్తి


నీరు నిల్వ ఉన్న కుండీలను పరిశీలిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు

తాడేపల్లిగూడెం రూరల్: దోమల ద్వారానే వ్యాధులు వ్యాప్తి చెందుతాయని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు అన్నారు. మంగళవారం మండలంలోని రామన్నగూడెం, కొండ్రుప్రోలు గ్రామాల్లో ఫీవర్ సర్వే, వెక్టార్ కంట్రోల్, హైజీన్ కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. తద్వారా దోమలు వృద్ధి చెందవన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఆరోగ్య కార్యకర్తలు అనంతలక్ష్మి, ఆరోగ్య సహాయకులు రత్నాజీ, ఇ.కాంతారావు, ఆశాలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆవులను గోశాలకు తరలిస్తున్నాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని 1 నుంచి 35 వార్డుల్లో గల మెయిన్ రోడ్డుల నందు, మార్కెట్ ప్రదేశాల్లో విచ్చలవిడిగా తిరుగుచున్న ఆవులను, దూడలను (పశువులు) పట్టించి 7వ వార్డు వాటర్ ట్యాంక్ వద్ద గ్రౌండ్‌లో సురక్షితంగా ఉంచుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ శ్యామూల్ తెలిపారు. పట్టణంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ సదరు పశువులకు గడ్డి (మేత), నీరు ఇవ్వడం చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం కొన్ని ఆవులను మాత్రమే ఆవుల యజమానుదారులు అపరాధ రుసుము కట్టి తీసుకువెళ్లారని, మిగిలిన ఆవులకు సంబంధించి యజమానుదారులు రాని కారణంగా సదరు ఆవులకు యజమానులు లేనట్లుగా భావించి గోశాలకు తరలిస్తున్నట్లు తెలిపారు.

కుట్టుమెషీన్ల పంపిణీ

సాక్షి, భీమవరం: పేద మహిళలు స్వతంత్రంగా జీవించేందుకు రాజ్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా కుట్టుమెషీన్లు పంపిణీచేస్తున్నట్లు దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్ అన్నారు. భీమవరంలో మంగళవారం ఆరుగురు మహిళలకు రాజ్‌ట్రస్ట్ అధ్యక్షుడు గంటా రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో కుట్టుమెషీన్లను పంపిణీ చేశారు. రూ.వెయ్యి చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పట్టెం శుభాకర్, జీడీ కరుణాకర్, సాదె మహేష్, దాసరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జేఎల్‌బీ స్కూల్లో యూనిటీ ఫర్ రన్

సాక్షి, భీమవరం: జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఝాన్సీలక్ష్మీ భాయి (జేఎల్‌బీ) మునిసిపల్ గరల్స్ హైస్కూల్లో మంగళవారం ఏకీకృతం ఐక్యత కోరుతూ యూనిటీఫర్ రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ ఆర్ వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఐక్యత ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం శ్రీనివాస్, అసిస్టెంట్ ఏఎంఓ రామకోటేశ్వరరావు, ఎంఐఎస్ ప్లానింగ్ కోఆర్డినేటర్ సీహెచ్ ఎస్‌వీ సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ ఐఇ కోఆర్డినేటర్ టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి

వీరవాసరం: జగనన్న లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ కె.జ్యోతి కోరారు. రాయకుదురు గ్రామ సచివాలయం వద్ద మంగళవారం నిర్వహించిన ఇళ్ల లబ్ధిదారుల ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాల అభ్యున్నత కోసం లేఅవుట్ ఏర్పాటు చేసి, ఇళ్ల స్థలాలను కేటాయించిందని, లబ్ధిదారులంతా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గెడ్డం భారతి, హౌసింగ్ ఏఈ కె.శ్రీరామచంద్రమూర్తి, గంగాధర్, సాధిక్, సాయి ,గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

2న భీమవరంలో రైతు సదస్సు

సాక్షి, భీమవరం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసగా నవంబర్ 2న స్థానిక ఆనంద్ ఫంక్షన్ హాల్లో రైతు సదస్సు నిర్వహించనున్నట్లు రైతు సంఘాల జిల్లా సమన్వయ సమితి నాయకుడు లంక కృష్ణమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు వ్యవసాయశాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు పాల్గొంటారని పేర్కొన్నారు. రైతు సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టినట్టు తెలిపారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

సాక్షి, భీమవరం: భీమవరంలో ఏఐటీయూసీ 104వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ జెండాను ఎగురవేశారు. ఏఐటీయూసీ నాయకులు చెల్లబోయిన రంగారావు, కిల్లరి మల్లేశ్వరరావు మాట్లాడుతూ 1920 బొంబాయిలో ఏఐటీయూసీని స్థాపించారని చెప్పారు. సమానపనికి సమాన వేతనం, క్లాప్ డ్రైవర్స్ వేతనాన్ని రూ.18 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలు గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, రోగులను పరీక్షిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ఆరోగ్యమే మహాభాగ్యమని ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని కొండ్రుప్రోలు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఏఎంసీ చైర్మన్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ అందరూ ఆరోగ్యవంతులుగా జీవించాలన్న తలంపుతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మదిలో మెదిలిన బృహత్తర కార్యక్రమమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రోగులకు వైద్యులు శ్రీహర్ష, ఏవీ.వెంకటేష్, జి.రూపాదేవి, పి.కాంచన ప్రియలు వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో నవాబుపాలెం సొసైటీ చైర్మన్ జడుడ హరిబాబు, కార్యదర్శి హరికిషోర్, బండి గణపతిరావు, పులమోలు వెంకటేశ్వరరావు, సీహెచ్‌వోలు, ఆరోగ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

కపర్ధీ ఆశయ సాధనకు కృషి చేయాలి


కపర్ధీ శత జయంతి సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కపర్ధీ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పలువురు వక్తలు కొనియాడారు. అమరజీవి ఎం.వి.ఎస్.కపర్ధీ శతజయంతి సభ మంగళవారం తాడేపల్లిగూడెం సుబ్బారావుపేటలోని బుద్దాల కన్వెన్షన్ హాల్ లో నిర్వహించారు. ఏపీ సాంస్కృతిక కళా పరిషత్తుల సమాఖ్య అధ్యక్షులు బుద్దాల వెంకట రామారావు అధ్యక్షత వహించారు. కపర్ధీ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళ్లలర్పించారు. రాష్ట్ర మాజీ మంత్రి, ఆచంట శాసనసభ్యులు చెరుకువాడ శ్రీ రంగనాధరాజు మాట్లాడుతూ కమ్యూనిస్టులు మాత్రమే నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి రాజకీయాల్లో నీతి, నిజాయితీలు పాటిస్తున్నారని, అలాంటి విలువలను కాపాడుకోవడానికి ప్రయత్నం జరగాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, వైఎస్సార్ సీపీ యువనేత కొట్టు విశాల్, కపర్ధీ కుమారుడు మందలపర్తి కిషోర్ సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, రాష్ట్ర సీనియర్ నాయకులు నెక్కంటి సుబ్బారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు, వారి పిల్లలకు బహుమతులు


విజేతలకు బహుమతులు అందిస్తున్న ఏఎస్పీ సుబ్బరాజు

సాక్షి, భీమవరం: పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పోలీసులు, వారి పిల్లలకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు మంగళవారం అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు బహుమతులు అందజేశారు. వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతిగా ఆర్ఎస్ఐ కె.లెనిన్ రూ.5 వేలు, ద్వితీయ బహుమతిగా డబ్ల్యూఆర్ఎస్ఐ ఇ.ఇందుమతి రూ.3 వేలు, ద్వితీయ బహుమతిగా కానిస్టేబుల్ వి.మణికంఠ రూ.2 వేలు ఏఎస్పీ సుబ్బరాజు చేతులు మీదుగా అందుకున్నారు. పోలీస్ పిల్లలకు నిర్వహించిన పోటీల్లో జి.తేజస్వి (ప్రథమ) జి.రోహిత్ (ద్వితీయ), ఎస్ మనోజ్ఞ(తృతీయ) బహుమతులు అందుకున్నారు. పోలీస్ సిబ్బందికి నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో డబ్ల్యూఆర్ఎస్ఐ ఇ.ఇందుమతి (ప్రథమ) టి.బిందుభవాని (ద్వితీయ), ఆర్ఎస్ఐ కె.లెనిస్ (తృతీయ) బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ మోజెస్, డీసీఆర్‌బీ సీఐ అహ్మదున్నీసా, ఆర్ఐ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పటేల్ జీవితం యువతకు ఆదర్శం


తణుకు అర్బన్ : ఏకతా దివస్ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

తణుకు అర్బన్: దేశాన్ని సమైక్యంగా నిలబెట్టిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తిని విద్యార్థులు అలవరచుకోవాలని తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్ హెచ్ఎం కె.పద్మావతి అన్నారు. మంగళవారం జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రపతి రోడ్డులో ఏక్‌తా దివస్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ తనకున్న రాజనీతిదక్షతతో దాదాపు 560 రాజ్య సంస్థానాలను స్వాతంత్ర్య భారతంలో విలీనం చేసిన మహనీయుడు పటేల్ అని విద్యార్థులకు తెలిపారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, దేశభక్తి గేయాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో సీతామహలక్ష్మి, వెంకట్రాజు, గోపాలకృష్ణ, విద్యాకమిటీ చైర్మన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దేశాన్ని ఒక్కటి చేసిన పటేల్

తాడేపల్లిగూడెం: భారతదేశమంతా ఒక్కటిగా ఉండాలని ,దేశంలోని సంస్థానాలను విలీనం చేసిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని ఏపి నిట్ రిజిస్ట్రార్ దినేష్ పి.శంకరరెడ్డి అన్నారు. సోమవారం నిట్‌లో ఏక్తాదివస్ నిర్వహించారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ బ్రిటిష్ పాలకుల విధానాలకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన నాయకుల్లో పటేల్ ఒక్కరన్నారు. ఈ కార్యక్రమంలో డీన్‌లు డాక్టర్ బి.వీరేష్‌కుమార్, టి.కురుమయ్య, జీఆర్‌కె.శాస్త్రి, ఆచార్యులు వి.సందీప్, కిరణ్ తీపర్తి తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లబాయ్ పటేల్ విశే కృషి మరువలేనిది

తణుకు టౌన్: భారతీయుల ఐక్యత కోసం, దేశంలో స్వదేశీ సంస్థానాలు ఇండియన్ యూనియన్‌లో విలీనం కోసం మాజీ ఉప ప్రధాని,, మొదటి దేశ హోం శాఖా మంత్రి సర్దార్ వల్లబాయ్ పటేల్ విశేష కృషి చేశారని మహిళా కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి చెప్పారు. మంగళవారం సర్దార్ వల్లబాయ్‌పటేల్ 148వ జయంతి సందర్భంగా కళాశాలలో జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ కరుటూరి రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు జీ రమ్య, సీహెచ్ రమేష్ బాబు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఇతర అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.


తాడేపల్లిగూడెం: ఏపి నిట్‌లో ఏక్తాదివస్ కార్యక్రమంలో రిజిస్ట్రార్ దినేష్ శంకరరెడ్డి తదితరులు


తాడేపల్లిగూడెం(టీఓసీ)రన్ ఫర్ యూనిటీలో ఎంఈఓ పీఎంకే జ్యోతి

జెడ్పీ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు మంగళవారం ఉత్సాహంగా రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం జరిగింది. ర్యాలీకి ఎంఈఓ పీఎంకే జ్యోతి, ప్రధానోపాధ్యాయులు ఎం.సత్యనారాయణ, ఎన్‌సీసీ అధికారి కేవీ గణపతిరావు, పి.రాజు, నాని పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా పంచాయతీ కార్యాలయం

భీమవరం అర్బన్: భీమవరం మండలం కొత్తపూసలమర్రు గ్రామంలో పంచాయతీ కార్యాలయం ప్రారంభానికి సిద్ధమైంది. గ్రామం నుంచి గూట్లపాడులో సచివాలయానికి రెండు కిలోమీటర్లు ఉండటంతో గ్రామస్తులు, లబ్ధిదారులు, వలంటీర్లు వెళ్లడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సచివాలయ సిబ్బంది, కార్యదర్శి, వివిధ శాఖల అధికారులు గ్రామానికి రావడానికి ఇక్కట్లు తప్పడం లేదు. ఈ సమస్యను ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, సర్పంచ్ జల్లా కొండయ్య, ఎంపీటీసీ సభ్యుడు తిరుమాని తులసీరావు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా రూ.25 లక్షలు మంజూరు చేశారు. దీంతో తక్కువ వ్యవధిలోనే పంచాయతీ కార్యాలయాన్ని నిర్మించి గ్రామస్తులకు అందుబాటులోకి తీసుకురావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బాస్కెట్‌బాల్ విజేతలకు అభినందన


బాస్కెట్‌బాల్ విజేతలను అభినందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: జేఎన్టీయూకే సెంట్రల్‌జోన్ బాస్కెట్‌బాల్ పోటీల్లో స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ కేవి మురళీకృష్ణంరాజు తెలిపారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో విజేతల వివరాలను ఆయన వెల్లడించారు. పీడీ పి.సత్యనారాయణరాజు మాట్లాడుతూ అక్టోబర్ 29, 30 తేదీల్లో ఎన్టీఆర్ జిల్లా మైలవరం లక్కిరెడ్డి బాల్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో టీం కెప్టెన్‌గా వి.సాత్విక, టీం సభ్యులుగా డి,సంధ్య, బీఎల్ సత్యశ్రీ, కె.సాయి ప్రసన్న, బి.అరుణభాయ్, బి.చైతన్య లహరి, ఎం పూజమన్విత, ఎ.మేఘనాభాను, ఎస్‌కే ఖాదరున్నీషా, కె.సుప్రియ, డి.నిహారిక, కె.ప్రవల్లిక పాల్గొన్నారని చెప్పారు. కేరళలో జరిగే సౌత్ జోన్ బాస్కెట్‌బాల్ పోటీలకు జేఎన్టీయూకే టీం తరఫున తమ విద్యార్థులు నలుగురు ఎంపికయ్యారని వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్స్ హరి మోహన్, జి.సారిక, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

‘సాక్షి’ స్పెల్‌బీకి విశేష స్పందన


సాక్షి స్పెల్-బీ పరీక్ష రాస్తున్న విద్యార్థినీ విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ) : సాక్షి ఆధ్వర్యాన ప్రతి ఏటా రాష్ట్ర వ్యాప్తంగా పలు విద్యా సంస్థల్లో నిర్వహించే స్పెల్‌బీ పరీక్షను మంగళవారం మహలక్ష్మినగర్‌లోని ఆదిత్య ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో నిర్వహించారు. ఇంగ్లీష్ విభాగంలో నిర్వహించిన ఈ పరీక్షకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. 57మంది విద్యార్థులు పరీక్ష రాశారు. విద్యార్థులు పరీక్ష రాశారు. ఈ సందర్భంగా కె.వాసుదేవ, ఆదిత్య స్కూల్ మాట్లాడుతూ స్పెల్‌బీ పోటీ పరీక్ష ద్వారా గత కొన్నేళ్లుగా సాక్షి చేస్తున్న ప్రయత్నం అభినందనీయమన్నారు. ఇంగ్లీష్ భాష విషయంలో, విద్యార్థుల్లో నిగూడంగా దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఇంగ్లీష్‌లో ప్రావీణ్యం సాధించడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. పరీక్షలను స్కూల్ వైస్ ప్రిన్సిపల్ ఎస్.అరుణ, ఇంగ్లీషు టీచర్లు అనిల్‌రావు, సంధ్య, దుర్గాభవానీలు పర్యవేక్షించారు.

సాక్షి యాజమాన్యానికి కృతజ్ఞతలు


చిన్ననాటి నుంచే సాక్షి స్పెల్-బీ కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థినీ విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెరుగుతుంది. పాఠశాల స్థాయి నుంచి పరీక్షలకు హాజరుకావడం వల్ల విద్యార్థుల్లో ప్రతిభ వెలికితీయవచ్చు. వారి భవిష్యత్తుకు ఎంతో ఉపయోగకరం.

– కె.శ్రీనివాసరెడ్డి, ఆదిత్య స్కూల్ డైరెక్టర్

అవగాహన వస్తుంది


సాక్షి నిర్వహిస్తున్న స్పెల్-బీ రాయడం వల్ల పోటీ పరీక్షలకు ఏ విధంగా సిద్ధం కావాలనే విషయంలో అవగాహన వస్తుంది. పోటీ పరీక్షలు అంటే భయం పోతుంది. పై స్థాయిలకు వెళ్లాలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాను.

-కె.సూర్య, 6వ తరగతి, ఆదిత్య స్కూల్

పై స్థాయిలకు వెళ్లేందుకు స్పెల్-బీ ఉపయోగం


ప్రిలిమినరీ పరీక్ష రాసి మంచి మార్కులు సాధించి పై స్థాయిలకు వెళ్లేందుకు కృషి చేస్తాను. పరీక్ష బాగా రాశా. ఇటువంటి పరీక్షలు వల్ల మరింత ఉత్సాహం వస్తుంది. ఇంగ్లీషు మెరుగు కోసం సాక్షి చేపట్టిన స్పెల్-బీ కార్యక్రమం బాగుంది.

– బి.శివతేజ,9వ తరగతి. ఆదిత్య స్కూల్

ఈ పరీక్షల వల్ల ఉత్సాహం పెరుగుతుంది


పోటీ అనేది ఏ స్థాయిలో ఉంటుందో స్పెల్-బీ ద్వారా అర్థం చేసుకోవచ్చు. పై స్థాయిలోకి చేరుకుంటే ఉత్సాహం పెరిగి మరింత శ్రద్ధ పెట్టేందుకు వీలు అవుతుంది. మంచి ఫలితం సాధించేందుకు బాగా కష్టపడాలి. సాక్షి స్పెల్-బీ మంచి కార్యక్రమం.

– ఎస్.వినీల,9వ తరగతి, ఆదిత్య స్కూల్